## బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు



విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ విజిలెన్స్ అధికారి సురేంద్ర కుమార్ దీక్షిత్, ఉద్యోగులు

జూబ్లీహిల్స్, నవంబర్ 4: అవినీతికి దూరంగా ఉండడం ద్వారా దేశంపై మనకున్న విధేయతను ప్రదర్శించవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ విజిలెన్స్ అధికారి సురేంద్ర కుమార్ దీక్షిత్ పేర్కొన్నారు. శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడాలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు బ్యాంక్ ఆఫ్ బరోడాలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు ఈ విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బ్యాంక్ ఆఫ్ బరోడా విజిలెన్స్ న్యూస్ లెటర్ ప్రత్యేక సంచికతో పాటు అవినీతిని నిర్మూలించాలన్న సందేశంతో రూపొందించిన సంక్షిప్త యానిమేటెడ్ ఫిల్మ్‌ను బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో దేబదత్త చంద్ విడుదల చేశారు. దీంతోపాటు బీవోబీ హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో జీఎం, జోనల్ హెడ్ రితీశ్ కుమార్ నేతృత్వంలో వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని జోనల్, ప్రాంతీయ కార్యాలయాల సిబ్బందితో పాటు ఖాతాదారులు, ప్రజలు హాజరయ్యారు.

## ఉర్రూతలూగించిన యమహా ట్రాక్ డే



శామీర్‌పేటలోని చికెన్ సర్క్యూట్‌లో యమహా ట్రాక్ డే ఈవెంట్

శామీర్‌పేట, నవంబర్ 4 : హైదరాబాద్‌లో 200 మంది ఉత్సాహవంతులైన యమహా అభిమానులను యమహా ట్రాక్ డే ఈవెంట్ ఉర్రూతలూగించింది.ఇండియా యమహా మోటర్(ఐవైఎం) ప్రైవేట్ లిమిటెడ్ తన వినియోగదారుల కోసం నవంబర్ 4,5వ తేదీల్లో హైదరాబాద్ శామీర్‌పేటలోని చికెన్ సర్క్యూట్‌లో ప్రత్యేకమైన ట్రాక్ డే ఈవెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఉత్తేజకరమైనది కాల్ ఆఫ్ ది బ్లూ బ్రాండ్ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యమహా బైక్స్ యజమానులు, అభిమానులు పాల్గొన్నారు.

## పేదోడి కడుపునిండినప్పుడే చట్టాలకు సార్థకత



సెస్‌లో జరిగిన సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థికవేత్తలు

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వాలు చేసే చట్టాలతో పేదోడి ఆకలి తీరదని, వారి కడుపు నిండేలా విధానాలను అమలు చేసినప్పుడే జీరో హంగర్ సాధ్యమని పలువురు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. అమీర్‌పేట్‌లోని సెంటర్ ఫర్ సోషల్ స్టడీస్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ సైన్స్ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన వార్షిక సదస్సు శనివారం ముగిసింది. సుస్థిర అభివృద్ధి, పట్టణీకరణ, మహిళ సాధికారిత, ఉద్యోగ కల్పన, జీరో హంగర్ అంశాలపై నిపుణులు సుదీర్ఘమైన చర్చలు నిర్వహించారు. వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు ఎస్ఆర్ హాషీమ్, ప్రొ. డీఎన్ రెడ్డి, గుమ్మడి శ్రీదేవితోపాటు, ఈపీడబ్ల్యూ సంపాదకులు ప్రొ. ఎస్ మహేంద్ర దేవ్, ఏ గణేశ్ కుమార్, విజయలక్ష్మి పాండే సంపాదకీయంలో ప్రచురించిన ‘ఆకలి రహిత భారతదేశ నిర్మాణం, ఎదురయ్యే సవాళ్లు, విధాన రూపకల్పన’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మూడురోజుల పాటు జరిగిన ఈ సదస్సులో 17 టెక్నికల్ సెషన్లలో 137 పరిశోధన పత్రాలను సమర్పించినట్లు నిర్వహకులు పేర్కొన్నారు. ఇలాంటి మేధోమధన సదస్సుల్లో అన్ని వర్గాలకు చెందిన వృత్తి నిపుణుల ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఉందని 22వ వార్షిక సదస్సు అధ్యక్షులు ప్రొ. ఎస్. మహేంద్రదేవ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ప్రొ. ఈ రేవతి, ఐఏఎస్ఎస్ఐ సభ్య కార్యదర్శి ప్రొ. ఐసీ అవస్తి తదితరులు పాల్గొన్నారు.





శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థాయి పార్టీ బూత్ కమిటీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ప్రభుత్వ విప్ గాంధీ

# సంక్షేమమే నమూనా.. సమర్థ పాలన

- అరెకపూడి గాంధీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

మియాపూర్ , నవంబర్ 4 : కుల, మత, ప్రాంత కొట్లాటల్లేకుండా ప్రజా సంక్షేమమే నమూనాగా సీఎం కేసీఆర్ అహరహం కృషి చేస్తున్నారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి నమూనానే ముమ్ముందు కొనసాగించుకునేందుకు ఈ ఎన్నికలలో ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంపూర్ణ తోడ్పాటును అందించాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థాయి పార్టీ బూత్ కమిటీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో ప్రభుత్వ విప్ గాంధీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో ఒక్క కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేక ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రధాని, అగ్ర నేతలు, పక్క రాష్ట్రాల సీఎంలు తెలంగాణకు వరుస పెడుతున్నారని, వారి పాచికలు ఇక్కడ చెల్లవని అన్నారు. 60 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ పరిపాలించినా అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అనతి కాలంలోనే విశేషమైన అభివృద్ధికి నోచుకున్నదన్నారు. నగరంలో ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వందలాది కంపెనీలు ముందుకు వస్తున్నాయని ఇదంతా సీఎం కేసీఆర్ సమర్థ పాలనకు తార్కాణమన్నారు. ఎమ్మెల్యే టికెట్ల కోసం ఢిల్లీకి పరుగులు తీసే ప్రతిపక్ష నేతలు అధిష్టానం చేతులో కీలబొమ్మలని, రాజకీయాల కోసం ప్రతిపక్షాలు అనైతిక పొత్తులు పెట్టుకుంటున్నాయని అన్నారు. కానీ బీఆర్ఎస్ పొత్తు మాత్రం ప్రజలతోనేనని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావటం ఖాయమన్నారు.దేశంలోనే పెద్ద నియోజకవర్గాల్లో ఒకటిగా ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గ అభ్యర్థి అరెకపూడి గాంధీని అధిక మెజార్టీతో గెలిపించుకుని అసెంబ్లీకి పంపాలని మంత్రి కేటీఆర్ కోరారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 9 వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని, ప్రజల మద్దతుతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేస్తామని చెప్పారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించానని నియోజకవర్గ ప్రజలు మరోసారి తనకు అవకాశం కల్పించి విజయాన్ని అందించాలని, సేవకుడిలా పని చేస్తానని విప్ గాంధీ స్పష్టం చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లద్దె నాగరాజు సహా పలువురు మంత్రి కేటీఆర్ ,విప్ గాంధీల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, మంజుల రెడ్డి, రోజాదేవి, దొడ్ల వెంకటేశ్ గౌడ్ , ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, సింధురెడ్డి సహా పార్టీ డివిజన్ అధ్యక్షులు సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సీఎస్‌కు సరస్వతి ఆశీస్సులు



చందానగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు శనివారం విచ్చేసిన శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతిని ఆలయ సముదాయంలో రాష్ట్ర ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరి శాంతి కుమారి కలిసి ఆయన చేతుల మీదుగా రాజ శ్యామల అమ్మ వారి వస్త్రాలను అందుకున్నారు. అనంతరం స్వామిజీ ఆశీస్సులు పొందారు.

## శమరిమలకు అద్దె బస్సులు

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): వచ్చే నెల నుంచి శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం ప్రత్యేక లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తూ గ్రేటర్ జోన్ ఆర్టీసీ అధికారులు శనివారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అయ్యప్ప స్వాములు ప్రత్యేకంగా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు ఈ మేరకు సికింద్రాబాద్ ప్రాంతీయ అధికారి ఖుస్రో షా ఖాన్ పేర్కొన్నారు. సుశిక్షుతలైన డ్రైవర్లతో, భద్రమైన ప్రయాణానికి అవకాశం కల్పిస్తుందన్నారు. బస్సులో టీవీ సౌకర్యంతో పాటు ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామాన్లు సర్దేందుకు ఒక వ్యక్తి (సీటు లేకుండా) ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. బస్సును అద్దెకు బుక్ చేసే గురుస్వామికి ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేసే గురుస్వామి రోజు రూ.300 చొప్పున కమిషన్ ఇస్తామని ప్రాంతీయ అధికారులు తెలిపారు. శమరిమలకు వెళ్లే దారిలో ఇతర పుణ్య క్షేత్రాలు దర్శించుకునే వెసులుబాటు ఉందన్నారు. వివరాలకు సమీపంలోని డిపో మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు. అయ్యప్ప భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

## మూగజీవాలకు 1962 సేవలు భేష్

### అమెరికా విస్కాన్సిన్ బృందం ప్రశంసలు



సీతారాంబాగ్‌లోని ప్రభుత్వ పశువైద్యశాలను సందర్శించిన అమెరికా విస్కాన్సిన్ వెటర్నరీ యూనివర్సిటీ వైద్య బృందం, 1962 ప్రోగ్రామ్ మేనేజర్ డా.బగీష్ మిశ్రా తదితరులు

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) / శామీర్‌పేట / మెహిదీపట్నం : 108అంబులెన్స్ తరహాలో మూగజీవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1962అంబులెన్స్ సేవలపై అమెరికా విస్కాన్సిన్ వైద్య బృందం హర్షం వ్యక్తం చేసింది. అమెరికా నుంచి నగరానికి చేరుకున్న విస్కాన్సిన్ యూనివర్సిటీ (వెటర్నరీ) వైద్య బృందం శనివారం నగరంలోని సీతారాంబాగ్ పశువైద్యశాలను సందర్శించింది. అక్కడ పశువులకు అందిస్తున్న వైద్యసేవలతో పాటు అంబులెన్స్ సేవలను 1962 ప్రోగ్రామ్ మేనేజర్ డా.బగీష్ మిశ్రా అమెరికా పశు వైద్య బృందానికి వివరించారు. ముందుగా పశువైద్యశాలను సందర్శించిన అమెరికా బృందం ఆ తరువాత స్థానికంగా ఉన్న పలు గోశాలలను సందర్శించి, అక్కడి పశువులకు ప్రభుత్వ పశు వైద్యశాలలు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమెరికా పశు వైద్య నిపుణులు డాక్టర్ కెయిత్ పాల్సన్, డాక్టర్ రియన్ బ్రెవుర్ మాట్లాడుతూ మూగ జీవాల కోసం తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న వైద్య సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షహీద్, జిల్లా మేనేజర్లు రత్నం, తిరుపతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని నిర్మూలించాలి

### జోనల్ రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : సమాజాభివృద్ధిలో అవినీతి పెద్ద లోపమని, దానిని నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. ఈ మేరకు జోనల్ రైల్వే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిఘా అవగాహన వారోత్సవాలలో భాగంగా శనివారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ ప్రాంగణంలో కొనసాగిన ‘సమగ్రత వాకథాన్’ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవినీతి నిర్మూలన కోసం ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్ సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ మల్ఖేడ్, హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్లు, వివిధ శాఖలకు చెందిన సీనియర్ రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.